గనుల నిర్వహణపై దృష్టి సారించాలి

కడప కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మైనింగ్ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జేసీ అదితిసింగ్‌తో కలసి జిల్లాలో మైనింగ్ క్వారీల నిర్వహణపై సంబంధిత మైన్స్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అపార ఖనిజ నిక్షేపాలు ఉన్నాయన్నారు. వాటిని జిల్లా ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ఎన్ని గనులు ఉన్నాయి? నిర్వహణలో ఉన్న అన్ని గనులకు, క్వారీలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు లోబడి ఉన్నాయా? అన్నిరకాల భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? వార్షిక రాబడి, సామాజిక బాధ్యత తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, మైన్స్ డీడీ సుబ్రమణ్యం, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మూర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, తహశీల్దార్లు హాజరయ్యారు.

జోరుగా రబీసాగు

- బుడ్డశనగ సాగుకే రైతుల మొగ్గు
- విత్తనాల కోసం పరుగులు
- ఆశాజనకంగా వర్షాలు



బుడ్డశనగ సాగుకోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

కడప రూరల్, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సాగు జోరందుకుంది. ఈశాన్య రుతుపవనాలు అనుకూలించి ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో నేలమ్మ పదునెక్కింది. దీంతో రబీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా అంతటా వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉంటున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో అసమతుల్య వర్షాల కారణంగా దాపురించిన కష్టాలను దిగమింగుతూ రబీ పంటల సాగుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. రబీలో 1,39,796 హెక్టార్లలో సాగు అంచనా కాగా ఇందుకు పంటల వారీగా అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆయా మండలాలకు సరఫరా చేసి రైతులకు పంపిణీ చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో దాదాపు 79,613 హెక్టార్లలో బుడ్డశనగ సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో విత్తనాల కోసం అన్నదాతలు పరుగులు పెడుతున్నారు.

విత్తనాల పంపిణీ

సబ్సిడీ ధరకు ప్రభుత్వం అందిస్తున్న బుడ్డశనగ విత్తనాల పంపిణీ జిల్లాలో కొనసాగుతోంది. రబీలో 79,613 హెక్టార్లలో బుగ్గశనగ సాగు లక్ష్యం కాగా 33,000ల క్వింటాళ్ల విత్తనానలు మంజూరు అయ్యాయి. వీటిని బద్వేల్, పోరుమామిళ్ల, కెసి కెనాల్ ఆయకట్టు మినహా ఇతర 22 మండలాల్లో పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికి 22,000 వేల క్వింటాళ్ల వరకు పంపిణీ చేశారు. ఇంకా 11,000 వేల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేయాల్సి ఉంది.

15,882.74 హెక్టార్లలో పంటల సాగు

2025-26 రబీ సీజన్ నవంబర్ 1 నుంచి ప్రారంభమైంది. 1,39,796 హెక్టార్లలో పలు పంటలు సాగు అంచనా కాగా ఇప్పటి వరకు 15,882.74ల హెక్టార్లలో సాగయ్యాయి. ఇందులో బుడ్డశనగ 79,613 హెక్టార్లకు గాను 7,864.56 హెక్టార్లలోను, వరి 11,645 హెక్టార్లుకు గాను 82.75 హెక్టార్లలో, పెసర పంట 2,894 హెక్టార్లకు గాను 278.41 హెక్టార్లలో, మినుము పంట 18,274 హెక్టార్లకు గాను 6,463.64 హెక్టార్లలోను, వేరుశనగ పంట 5,079 హెక్టార్లకు గాను 517.28 హెక్టార్లలోను, సెసమమ్ 4,566 హెక్టార్లకు గాను 167.35 హెక్టార్లలోను సాగుకు నోచుకున్నాయి.



వంక నీటిలో ఎరువుల బస్తాలతో వెళుతున్న ట్రాక్టర్

కల్వర్టు లేక..

వల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లఓబాయపల్లె రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే కాలువ దాటాల్సిందే. వర్షాకాలం కాలువలో నీరున్నా ఇదే మార్గంలో వెళ్లక తప్పదు. ఇక్కడ కల్వర్టు నిర్మించాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గొల్లఓబాయపల్లెతో పాటు రాగిమాకులపల్లె, కొత్తపల్లె, చిన్ననాగిరెడ్డిపల్లె, లేబాక, కొప్పోలి ప్రాంతానికి చెందిన రైతుల భూముల వద్దకు వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. పంటలు సాగు చేసే సమయంలో విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లాలన్నా.. పంట దిగుబడులు ఇళ్లకు తెచ్చుకోవాలన్నా చాలా ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కల్వర్టు నిర్మించాలని వీరు కోరుతున్నారు.

అనారోగ్యంతో జీవిత ఖైదీ మృతి



మృతిచెందిన ఆరికట్ల చిన్నసుంకిరెడ్డి

కడప క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైల్లో ఓ జీవిత ఖైదీ అనారోగ్యంతో మృతి చెందాడని జైలు పర్యవేక్షణాధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు. గురువారం తెల్లవారుజామున ఆ జీవితఖైదీకి తీవ్ర అనారోగ్యం రావడంతో వైద్య పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన ఆరికట్ల చిన్నసుంకిరెడ్డి ఒక హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడి అక్టోబరు 2021లో కడప సెంట్రల్ జైలులో ఉన్నారు. ఇతను జైలుకు వచ్చినప్పటికే గుండెకు మూడు స్టంట్‌లు వేసి ఉన్నారు. బీపీ, షుగర్‌తోనూ ఇబ్బంది పడేవారు. జైలులోకి వచ్చాక కూడా మరోసారి స్టంట్ వేశారు. అనేక పర్యాయాలు అనారోగ్య సమస్యలతో కడప, కర్నూలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ నెల మొదటివారంలో కూడా కర్నూలు ఆసుపత్రిలో వైద్యం పొందారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ఆయాసంగా ఉందని చెప్పడంతో వెంటనే చిన్నసుంకిరెడ్డిని జైలు డాక్టర్ సలహా మేరకు కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు అతని పల్స్ ఈసీజీ పరీక్షలు చేసి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారని జైలు పర్యవేక్షణాధికారి తెలిపారు.

జనవరిలో గండికోట ఉత్సవాలు

కడప కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గండికోట ఉత్సవాలు-2025 వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అదికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా టూరిజం కమిటీ సమావేశం జరిగింది. కలెక్టరేట్‌తో జేసీ అదితిసింగ్, డీఎఫ్ఓ వినీత్‌కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గండికోట ఉత్సవాలను జనవరిలో వారం రోజుల పాటు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. మొదటి నాలుగు రోజులు ప్రమోషన్ ఈవెంట్స్, మిగతా మూడు రోజులు ముఖ్యమైన ఈవెంట్స్ నిర్వహించాలన్నారు. జాతీయ స్థాయిలో పేరుపొందిన మ్యూజిక్, డ్యాన్సు బృందాలను ఆహ్వానించాలన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సంఘాలతో కడప జిల్లా స్ట్రీట్ ఫుడ్ ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక వసతులు, టాయిలెట్స్, పారిశుధ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గండికోట ఉత్సవాలపై సురభి నాటక బృందంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, పర్యాటక అధికారి సురేశ్, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి తదితరులు ల్గొన్నారు

రెవెన్యూ తప్పిదంతోనే భూ ఆక్రమణలు

- అన్ని రెవెన్యూ సర్వే నెంబర్లు గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దాలి
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



భూరికార్డుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్లనే భూ ఆక్రమణలు జరిగాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. భూరికార్డుల స్వచ్ఛీకరణ ద్వారా అన్ని మండలాల్లోని రెవెన్యూ సర్వే రికార్డులను గోల్డెన్ రికార్డులుగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో చోటు చేసుకున్న భూ సమస్యలపై రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణతో గోల్డెన్ రికార్డుల సాధన కోసం గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సంబంధిత రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, సెక్రటరీ శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బద్వేలు డివిజన్‌లోని బి.మఠం మండలానికి ఏర్పాటు చేసిన 20 మంది వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో కూడిన ప్రత్యేక బృందానికి పలు సూచనలు చేశారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వల్లనే భూ రికార్డుల్లో తప్పిదాలు జరిగాయన్నారు. ప్రత్యేకించి బద్వేలు, బిమఠం మండలాల్లో అధిక సంఖ్యలో భూ సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేక టీముల ద్వారా అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగానే ప్రతి సర్వే నెంబరును సంబంధిత విస్తీర్ణాన్ని, ఆర్ఎస్ఆర్, వెబ్‌ల్యాండ్ ద్వారా నమోదు చేస్తున్నామన్నారు. అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి కోర్టు వ్యవహారాలు, కుటుంబ వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ కార్యక్రమాన్ని ఆధునిక పరిజ్ఞానంతో చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నలుగురు అధికారులకు ఇంక్రిమెంట్లు కోత

- ఏడుగురు ఇంజనీర్లకు విముక్తి
- 2018లో ఏసీబీ నమోదు చేసిన కేసును ముగించిన ప్రభుత్వం



కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమాలకు పాల్పడ్డ నలుగురు అధికారులకు రెండేసి ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలకు 11 మందిని బాధ్యులుగా నిర్ధారిస్తూ అప్పట్లో ఏసీబీ కేసులు నమోదు చేసింది. పలు దఫాల విచారణలు, నిందితుల నుంచి వివరణలు తీసుకున్న తరువాత అనంతపురం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరు ఆర్.శ్రీనాథరెడ్డి, ఆయనకు సహాయకారిగా కడప రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.మహ్మద్ ఆలీలను విచారణాధికారులుగా నియమించారు. గత ఏడాది డిసెంబరు 6న విచారణ నివేదిక ప్రభుత్వానికి చేరింది. దీనిపైన తిరిగి అధికారుల నుంచి వివరణలు తీసుకున్న అనంతరం గురువారం ప్రభుత్వం తుది నిర్ణయం వెలువరించింది.

అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, చల్లా ఓబులేశు కొటేషన్లు, టెండర్లు లేకుండా పనులు మంజూరు చేసి అక్రమాలకు పాల్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. వీరికి తోడుగా అప్పటి కార్పొరేషన్ డిప్యూటీ డీఈఈ టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ కేవీ నాగేంద్రకుమార్‌ను కూడా బాధ్యులుగా నిర్ధారించి రెండేసి ఇంక్రిమెంట్ల వంతున కోత విధించింది. ఇదే కేసులో ఉన్న మరో ఏడుగురు ఇంజనీర్లకు మాత్రం కేసునుంచి విముక్తి కల్పించారు. డిప్యూటీ ఈఈలు పి.తులసీకుమార్, గోపాలకృష్ణమూర్తి, పి.కరీ ముల్లా ఖాన్, ఏఈలు బి.స్వరూప, ఎల్.నిరంజన్ రెడ్డి, ఎన్.దిల్షాద్, ఎం.సాయికృష్ణలకు ఊరట కలిగిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

వైవీయూలో సీతాకోకచిలుకల ఉత్పత్తి



సీతాకోకచిలుకలను వదులుతున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర శాఖ ప్రయోగశాలలో క్యాపిటేటివ్ బ్రీడింగ్ ద్వారా సీతాకోకచిలుకలను ప్రయోగశాలలో ఉత్పత్తి చేసినట్లు వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. గురువారం వైవీయూ బొటానికల్ గార్డెన్‌లో వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనటువంటి బటర్‌ఫ్లై పార్క్ వైవీయూకే సొంత కావడం విద్యాలయానికి వన్నె తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా బటర్‌ఫ్లై మ్యాన్ డాక్టర్ ఎస్‌పీ వెంకటరమణను వీసీ అభినందించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము మాట్లాడారు. అనంతరం అందరూ మొక్కలు నాటారు.

19న డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19వ తేదీన డీఫార్మసీ కోర్సు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు మంగళవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇంటర్మీడియట్ బైపీసీ లేదా ఎంపీసీ ఉత్తీర్ణత పొందిన విద్యార్థినులు అవసరమైన ధ్రువపత్రాలతో కళాశాలకు 19వ తేదీన నేరుగా హాజరుకావాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజు రూ.6,300గా ఉంటుందని, ఇతర వివరాలకు 9441667664, 9440144057, 7981353745 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బాలల భవిష్యత్‌ను చక్కదిద్దడానికే బాలోత్సవం 7

అధిక శబ్దాల సైలెన్సర్లు వాడితే కఠిన చర్యలు



7

కడప ఏడు రోడ్ల కూడలిలో సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం

10 ఎర్రచందనం దుంగలు పట్టివేత 6

ఖాతాలు ఖాళీ..!

- వర్క్ ఫ్రం హోం పేరుతో.. సైబర్ నేరగాళ్ల చేతివాటం
- సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలపై స్పందిస్తే.. అంతేగతి



కడప క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో చాలామంది వర్క్ ఫ్రం హోం కింద ఉద్యోగాలు చేశారు. ప్రస్తుతం కూడా ఇంట్లో కూర్చుని పనిచేస్తే తమకు జీతాలు వస్తాయనే ఆశతో కొందరు సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా వచ్చే ప్రకటనలకు స్పందిస్తూ వారికి తమ మొబైల్‌లోని డేటా మొత్తం అప్పగిస్తున్నారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు డబ్బులు స్వాహా చేసేస్తున్నారు. ఎక్కువగా సైబర్ నేరగాళ్లు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రాం, ఫేస్‌బుక్‌లలో యాడ్స్ పంపిస్తారు. వర్క్‌ఫ్రం హోం పేరుతో ఆశ కల్పిస్తారు. మొదట పెట్టుబడిగా రూ.500 నుంచి రూ.10వేల వరకు పెట్టిస్తారు. ఆ డబ్బుకు మొదట రెండింతలు ఇస్తారు. ఇలా ఒకటి, రెండుసార్లు చేస్తారు. దీంతో ఆత్యాశ పెరుగుతుంది. వేలు లక్షలు పెట్టుబడి పెట్టిన తరువాత బోర్డు తిప్పేస్తారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇలాంటి మోసాలు జిల్లాలో ఈ ఏడాదిలో 60కి పైగానే జరిగాయి. వీరంతా వర్క్ ఫ్రం హోం ద్వారా లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు.

వర్క్‌ఫ్రం హోం.. బాధితులు ఎందరో

- బద్వేలుకు చెందిన ఓ మహిళ హౌస్ వైఫ్‌గా ఉంటోంది. సోషల్ మీడియాలో కొన్ని ప్రకటనలు చూసింది. ఇంట్లోనే కూర్చుని ప్రకటనలను ఇతరులకు షేర్ చేస్తే అందుకు గాను కమీషన్ వస్తుందని ఆశ పడింది. దీంతో ఆమెకు కొంత డబ్బు వేస్తూ వచ్చారు. తర్వాత పెట్టుబడి పెడితే దానికి మూడింతలు ఇస్తామని ఆమెకు ఆశ పెట్టడంతో రూ.1.20లక్షలు డిపాజిట్ చేసింది. తరువాత వారు బోర్డు తిప్పేశారు.
- ఎర్రగుంట్లకు చెందిన ఓ మహిళ హౌస్ వైఫ్‌గా ఉంటోంది. తను ఇంట్లోనే ఉండి సంపాదించాలని భావించింది. సోషల్ మీడియాలోని ఓ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంది. తాను పెట్టిన పెట్టుబడికి రెండింతలు అమౌంటు అంటే ఆశ పడి రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయింది.
- ప్రొద్దుటూరు చెందిన ఓ మహిళ తాను కూడా రూ.3లక్షల మేర పెట్టుబడి పెట్టింది. అలాగే అదే ప్రాంతానికి చెందిన మరో మహి ళ రూ.2లక్షలు పెట్టుబడి పెట్టింది. వీరందరికీ రెట్టింపు ఆదాయం కాదు కదా.. కట్టిన డబ్బుకూడా వెనక్కి రాలేదు.
- కడపకు చెందిన ఓ యువతి తన ఇంటి వద్దనే ఉండి సంపాదించాలనే ఆశతో దాదాపు రూ.2లక్షలు డిపాజిట్ చేసింది. అంతే.. డబ్బు తీసుకున్న వారు బోర్డు తిప్పేశారు. డబ్బులు పోగొట్టుకున్నాక వీరు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

> పోలీసులు సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలతో పాటు కళాశాలలు, పాఠశాలల్లో అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నారు. అయినా సైబర్‌నేరగాళ్లు ఏదోరూపంలో ప్రజలను ఏమారుస్తూనే ఉన్నారు. ఇప్పుడు కొత్త పంథాలో ఆన్‌లైన్ ట్రేడింగ్, బ్రాండెడ్ వస్తువులకు ఇంట్లో కూర్చుని రేటింగ్ ఇస్తే కమిషన్ ఇస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. రూ.10 పెట్టుబడి పెడితే రూ.20 ఇస్తామని ఆశపెడుతన్నారు. ఇలాంటివారి బారినపడి మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దాదాపు ఇలాంటి ఘటనలు జిల్లాలో 60 వరకు చోటుచేసుకున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్ల చేతిలో చదువు రాని వారికంటే విద్యావంతులే ఎక్కువగా మోసపోతున్నారు. ఎక్కడా పది రూపాయలకు ఇరవై రావడం అనేది జరగదు. మొదట పదికి 20 ఇచ్చినా పోను పోను మన అత్యాశతో మన కొంపే మునుగుతుంది. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలపై స్పందించకుండా, ఎవరైనా కొత్త వ్యక్తులు మన బ్యాంకు వివరాలు అడిగినా తెలపకుంటే మన సొమ్ము భద్రంగా ఉంటుంది.

స్మగ్లర్‌పై పీడీ యాక్ట్

కలికిరి /కడప, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీడీ యాక్టు కింద ఒక ఎర్రచందనం స్మగ్లర్‌ను ఏడాది పాటు నిర్బంధించడానికి కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను ప్రభుత్వం ఆమోదిస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. బద్వేలు పట్టణం గుంతపల్లెలో నివాస మున్న అట్లూరి మండలం చలంగారిపల్లెకు చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య అలియాస్ శేషు (39)ను పీడీ యాక్టు కింద నిర్బంధంలోకి తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరు కూరి ఈ నెల 4న ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు వెంకటసుబ్బయ్యను పోలీసులు కడప సెంట్రల్ జైలుకు తరలించారు. కలెక్టర్ చర్యలకు సమర్థిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుల్ తిరుమలయ్య వీఆర్‌కు బదిలీ

- క్రికెట్ బెట్టింగ్ ఆరోపణలే కారణం

ప్రొద్దుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో వెలుగుచూసిన ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ తిరుమలయ్యను మైదుకూరు అర్బన్ పోలీసు స్టేషన్ క్రైంపార్టీ నుంచి ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తప్పించి వీఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. తిరుమలయ్యకు ప్రొద్దుటూరులో చాపకింద నీరులా సాగుతున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంతో సంబంధాలున్నట్లు తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. అందులో భాగంగా అతడిని కొద్ది రోజులపాటు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, టూటౌన్ సీఐ సదాశివయ్య లోతుగా విచారించారు. అలాగే కడప డీటీసీలో సైతం తిరుమలయ్యను ప్రత్యేకంగా పోలీసు అధికారులు విచారించారు. దీంతో సీఐల పాత్ర కూడా బయటికి వస్తుండటంతో ఇంటిగుట్టు రట్టు అవుతుందని భావించి విచారణను అటకెక్కించారని ప్రచారం సాగుతోంది. సంబంధిత సీఐలు రీజనల్ రేంజ్ అధికారుల వద్ద మొరపెట్టుకోవడంతో అక్కడి నుంచి వచ్చిన ఒత్తిళ్లతో విచారణను నిలిపివేశారని డిపార్ట్‌మెంటులోనే ప్రచారం సాగుతోంది. కాగా.. తిరుమలయ్యను మాత్రం ఎస్పీ వీఆర్‌కు బదిలీ చేశారని సమాచారం.



అన్నదాతకు మహర్దశ

- ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాగా అన్నమయ్య
- ప్రధానమంత్రి ధన-ధాన్య కృషియోజన పథకం కింద ఎంపిక
- ఆరేళ్లపాటు రూ.300 కోట్లకు పైబడి నిధుల విడుదలకు అవకాశం
- 36 కేంద్ర, రాష్ట్ర పథకాలను జోడించి వ్యవసాయాభివృద్ధికి చర్యలు



పునరుద్ధరణకు నోచుకోనున్న చెక్‌డ్యాంలు

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో దేశంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటూ వ్యవసాయ పరంగా వెనుకబడి ఉన్న 100 జిల్లాలను ఎంపిక చేసి ఆ జిల్లాలను వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన పథకం కింద ఎంపిక చేశారు. గత నెల 11న కేంద్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాను ధన-ధాన్యం భాగ్యం కింద చేర్చి ఆకాంక్షిత జిల్లాగా అన్నమయ్యను ఎంపిక చేస్తూ వ్యవసాయపరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు. రాష్ట్రంలో మన జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, ప్రకాశం అల్లూరి సీతారామరాజు జిల్లాలను కూడా ఎంపిక చేశారు. గత నెల 10న రాయచోటిలో కలెక్టర్ అధ్యక్షతన 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ ఈ పథకంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఈ పథకం ఉపయోగాలను అధికారులకు సవివరంగా తెలిపారు. రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటోంది. కోడూరు, రాజంపేట, పీలేరు నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా రాజంపేట, పుల్లంపేట ఎగువ ప్రాంతాలు, రాయచోటి, మదనపల్లె మెట్ట ప్రాంతాలతో పాటు సుమారు జిల్లాలోని 20 మండలాలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటూ వ్యవసాయపరంగా చాలా వెనుకబడి ఉన్నాయి. మెట్ట ప్రాంతాలను వ్యవసాయపరంగా అభివృద్ధి చేయడానికి వెనువెంటనే చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ ప్రకటించడంతో జిల్లా వ్యవసాయపరంగా శరవేగంగా అభివృద్ధి చేయడానికి మార్గం సుగమం కానుంది. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 36 పథకాలను సన్నిహితం చేసి దేశవ్యాప్తంగా ఈ పథకం కింద యేడాది నుంచి ఆరేళ్ల పాటు 24 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నిధుల్లో అన్నమయ్య జిల్లాకు ఈ ఆరేళ్లలో రూ.300 నుంచి రూ.400 కోట్లు వ్యవసాయాభివృద్ధికి విడుదలయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇందుకోసం ప్రత్యేక అధికారులను కూడా నియమించనున్నారు.



చుక్కనీరు లేక బీడు భూములుగా మారిన వ్యవసాయ భూమి

ఆకాంక్షిత జిల్లాతో ఉపయోగాలెన్నో...

ప్రధానంగా వ్యవసాయాభివృద్ధిలో భాగంగా జిల్లాలో వ్యవసాయ ఉత్పాదన పెంచడం, నీటి వనరుల లభ్యతను పెంచడం, రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు విరివిగా ఇవ్వడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట మార్పులు చేస్తారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సాహం ఇస్తారు. రైతులకు వివిధ నైపుణ్యాల శిక్షణలు, ప్రత్యేక ప్రాజెక్టులను గుర్తించడం, వ్యవసాయ సంబంధిత అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం అధికారుల కొరత లేకుండా చూడడం, ఫుడ్ ప్రాసెసింగ్ చేయడం, పశుసంపద పెంచడం, వ్యవసాయ పరిశ్రమలు ఏర్పాటు చేయడం, మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేస్తారు. ప్రధానంగా జిల్లాలో రైతుల జీవితాలను మెరుగుపరచడానికి ఈ పథకం ఎంతో ఉపకరిస్తుంది. ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వరి, వేరుశనగ, పసుపు, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలను విరివిగా పండించే అవకాశం ఉంది. అదేవిధంగా ఉద్యానవన పంటలకు నెలవైన రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో విస్తారంగా పండే బొప్పాయి, అరటి, నిమ్మ, మామిడి పంటల పెంపుదలకు ఈ పథకం ఎంతో ఉపకరించనుంది. తద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి వీలుంటుంది. భూగర్భజలాలు పెంపొందించడానికి, విరివిగా బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాలు, చెక్‌డ్యాంలు, చెరువుల్లో పూడిక తీయడం, కాలువలు పునరుద్ధరించడం, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయడం, నీటి వసతులను పెంచడం జరుగుతుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలుంటుంది. పండించిన పంటలను నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజిలను ఏర్పాటు చేస్తారు. దీంతో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ఆస్కారం ఉంటుంది. అటవీ, మెట్ట ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిన దుర్భిక్ష ప్రాంతాల్లో కొత్తగా నీటి నిల్వలను పెంపొందించే చర్యలు చేపడుతూ అక్కడ బిందుసేద్యం విరివిగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. అన్నదాతకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది.

ఆంధ్రజ్యోతే స్ఫూర్తి ...



ఆకాంక్షిత ధన-ధాన్య కృషి యోజన పథకం కింద అన్నమయ్య జిల్లా ఎంపిక కావడానికి ఆంధ్రజ్యోతే ప్రధాన కారణం. నేను ఈ ఏడాది సెప్టెంబరు 6వ తేదీ రాజంపేటకు వచ్చాను. ఇందులో భాగంగా ఈ జిల్లాను ఆకాంక్షిత జిల్లాగా ప్రకటించేందుకు గల కారణాలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో సవివరంగా తెలిపారు. ఈ కథనం ప్రచురితం కావడంతో దీన్ని సీఎం చంద్రబాబునాయుడుకు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు స్వయంగా నేనే పంపాను. దీనిపై సీఎం స్పందించి కేంద్రానికి విన్నవించడంతో అన్నమయ్య జిల్లాను ఈ పథకంలో చేర్చారు. దీనివల్ల అన్నమయ్య జిల్లా ఈ ఆరేళ్లల్లో వ్యవసాయపరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది అన్నదాత అన్నివిధాలా బాగుపడనున్నారు. ఈ ఆరేళ్లలో అన్నమయ్య జిల్లాకే రూ.400 కోట్ల నిధులు రానున్నాయి.

- లంకా దినకర్, రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్

జిల్లా ఎంపిక మనందరి అదృష్టం



ఆకాంక్షిత జిల్లాగా అన్నమయ్య జిల్లా ఎంపిక కావడం మనందరి అదృష్టం. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి కనీసం ఒక ప్రధాన ప్రాజెక్టు, ఒక ప్రధానమైన నీటి వనరులు లేని అన్నమయ్య జిల్లాకు ఈ పథకం వరప్రసాదం లాంటిది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా 24 వేల కోట్లు నిధులు విడుదలైతే మన అన్నమయ్య జిల్లాకు ఈ ఆరేళ్లలో రూ.400 కోట్లు నిధులు రావడం వ్యవసాయపరంగా ఎంతో అభివృద్ధి చెందడానికి వీలుంటుంది. ఇందులో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పాత్ర ప్రశంసనీయం.

- సాయిలోకేశ్‌కుమార్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు

పెద్దేరు వంతెనను ఢీకొన్న లారీ

తమిళనాడు డ్రైవర్‌కు గాయాలు



వంతెనను ఢీకొన్న లారీ

ములకలచెరువు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వంతెనను గురువారం ఉదయం ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... హైదరాబాదు నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నైకి వెళ్తున్న లారీ ఉదయం అదుపు తప్పి మండలంలోని పెద్దేరు వంతెనను ఢీకొంది. డ్రైవర్ నిద్రమత్తులో లారీని అదుపు చేయలేక వంతెనను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం విరుదనగర్ జిల్లా ఎస్.పుత్తూర్‌కు చెందిన అలాగర్ గాయపడ్డాడు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతింది.

10 ఎర్రచందనం దుంగలు పట్టివేత

ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు



పట్టుకున్న దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

రైల్వేకోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు రేంజి పరిధిలోని కోడివెంగమ్మ బావి అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం కూంబింగ్ చేస్తుండగా 10 ఎర్రచందనం దుంగలను గుర్తించామని, వాటిని సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నామని రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ నాగినేని చంద్ర, నాగినేని శివయ్య, నాగినేని సురేంద్ర అనే స్మగ్లర్లను పట్టుకుని వారి వద్ద నుంచి 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దుంగలు 291 కిలోల బరువు కల్గి ఉన్నాయని, వాటి విలువ రూ.1,42,738 చేస్తాయని తెలిపారు. స్మగ్లర్లు జనజీవన స్రవంతిలోకి వచ్చి తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఎర్రచందనం చెట్లను నరికితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. దాడుల్లో ఎఫ్ఎస్‌వో ఎం.మహేష్‌కుమార్, ఎఫ్‌బీవోలు ఎం.నాగేశ్వర్‌నాయక్, జనార్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


న్యుమోనియాపై అవగాహన కల్పించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, తదితరులు

మదనపల్లె అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియాపై అవగాహన కల్పించాలని మంత్రి సత్యకుమార్ అన్నారు. గురువారం మదనపల్లె పర్యటనలో భాగంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో న్యుమోనియాపై బ్యానర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రాణాంతకమైన న్యుమోనియా వ్యాధిని నివారించడం, త్వరగా వ్యాధిని గుర్తించి సమయానుకులంగా చికిత్స అందించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం డాక్టర్ లక్ష్మీనరసయ్య బొమ్మనచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణంలో ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. న్యుమోనియా నివారణ చర్యలపై అమలు పరిస్థితి, చిన్నారుల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, 104 జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్, ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్స్ ఫుర్గాన్‌ఖాన్, సల్మాన్, విష్ణువర్ధన్, భార్గవి, జిలానీ, రిచర్డ్, టీబీ విభాగ సూపర్‌వైజర్ ప్రభాకర్, శ్రీనివాసులు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయండి



మాట్లాడుతున్న నారాయణ

రాజంపేటటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు గుర్రప్ప ఆరోపించారు. గురువారం అన్నమయ్య ప్రాజెక్టును స్థానిక ముంపు ప్రదేశాలను సందర్శించారు. అనంతరం పట్టణంలోని ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టు కొట్టుకునిపోవడం వల్ల చుట్టుపక్కల గ్రామాలు నీటమునిగాయని, నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఇళ్లు కట్టివ్వడం, ఇంటి స్థలాలు ఇవ్వడం కాని చేయలేదని చుట్టుపక్కల గ్రామాల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి రైతుకు నీరు అందేలా కృషి చేయాలని లేకపోతే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్దన్, సుబ్బరాయుడు, విద్యార్థి సంఘ నాయకుడు సగిరి రాజేంద్రప్రసాద్, నాగేంద్రబాబు, గోపి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు చీడపీడలు, తెగుళ్ల నివారణకు సంబంధించి సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి మండలంలోని జ్యోతి, వంతాటిపల్లె గ్రామాల్లో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడి తోటల్లో పూత సమానంగా రావడానికి 10 గ్రాముల చొప్పున జింక్ 2.5 గ్రాములు బోరాన్, 1.25 గ్రాములు లీటరు నీటికి పిచికారి చేయాలని, ముదురు మామిడి తోటల్లో కల్టర్ వాడకంపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ తేనె మంచు పురుగు నివారణకు సరైన సమయంలో మూడు దశల్లో పురుగు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ వరి సాగును తగ్గిస్తూ ఉద్యాన పంటలవైపు రైతులు ఆసక్తి చూపాలని తెలిపారు. కార్యక్రమంలో మామిడి రైతులు, వ్యవసాయ విస్తరణాధికారి ప్రభాకర్‌రెడ్డి, రైతుసేవా సిబ్బంది ప్రేమ్‌సందీప్, హసీనా, చంద్ర, ప్రియదర్శిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ముఠా కేసులో రెండో రోజు విచారణ

- మృతదేహం తిరుపతికి తరలింపుపై ఆరా
- బెంగళూరు, గోవాకు ప్రత్యేక బృందాలు
- పోస్టుమార్టం పూర్తి.. బంధువులకు అప్పగింత



యమున మృతదేహం



డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్యతో మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా బృందం

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ వ్యవహారంపై ప్రభుత్వం దర్యాప్తు ముమ్మరం చేసింది. గురువారం చిత్తూరు వైద్య బృందం మదనపల్లెకు రాగా ఇక్కడి పోలీసు బృందం బెంగళూరు, గోవాకు వెళ్లింది. కిడ్నీ ఆపరేషన్ ఎలా జరిగింది..ఎక్కడ జరిగిందని వైద్య, ఆరోగ్యశాఖ ఆరా తీస్తుండగా, దీని వెనుక ఎవరున్నారు? లింకులు ఏంటి? డాక్టర్ ఎవరు? రిసీవర్ ఎవరనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విశాఖపట్నం ఏరియాకు చెందిన యమున (29)ను గాజువాక ప్రాంతానికి చెందిన మధ్యవర్తులు పద్మ, సత్యలు డబ్బులు ఆశ చూపి గ్లోబల్ ఆసుపత్రికి తీసుకొచ్చి కిడ్నీ తొలగించగా మరుసటి రోజు చనిపోయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి రోజు అన్నమయ్య జిల్లా వైద్య బృందం విచారణ చేపట్టగా గురువారం చిత్తూరు జిల్లాకు చెందిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి బృందం మదనపల్లెకు చేరుకుంది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సెకండరీ ఎడ్యుకేషన్ కమిషనర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్‌తో పాటు సీనియర్ సర్జన్ డాక్టర్ హరగోపాల్, అనస్థీషియా స్పెషలిస్టు డాక్టర్ సాయికిశోర్, ఫిజీషియన్ డాక్టర్ అమీర్‌అలీ, ఏడీ ఫణిభూషణ్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కృష్ణ, తదితరులు ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేశ్‌తో సమావేశమయ్యారు. యమున మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయకుండా తిరుపతికి పంపడంపై ఆరా తీశారు. మానవ అవయవం మిస్సింగ్ అయినట్లు కేసు నమోదు అయిన నేపథ్యంలో యూరాలజీ, ఫోరెన్సిక్ నిపుణులు అందుబాటులో లేకపోవడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక జిల్లా ఆసుపత్రిలోని టెక్నీషియన్ బాలరంగడు వ్యవహారంపై డయాలసిస్ కేంద్రంలోని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సంఘటన జరిగిన గ్లోబల్ ఆసుపత్రికి చేరుకున్నారు. అన్నమయ్య జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు నుంచి నివేదిక రూపంలో వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఆయన అప్పటికే పోలీసుల అదుపులో ఉండటంతో తిరిగి వెళ్లిపోయారు.

బెంగళూరు, గోవాకు పోలీసులు

యమున నుంచి కిడ్నీని తొలగించడంలో కీలకంగా వ్యవహరించిన డాక్టర్, రిసీవర్ కోసం పోలీసు బృందాలు బెంగళూరు, గోవాకు వెళ్లినట్లు తెలిసింది. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, వారిచ్చిన సమాచారం మేరకు బెంగళూరు, గోవాకు వెళ్లారు. గోవాలో రిసీవర్‌తో పాటు స్పెషలిస్టు వైద్యుడు, మరో మధ్యవర్తి కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కేసులో బెంగళూరు వైద్యుడు, డయాలసిస్ టెక్నీషియన్లు, మధ్యవర్తులు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. యమునకు విశాఖపట్నంలోనే కిడ్నీ పరీక్షలు నిర్వహించి, తర్వాత తొలగించడానికి మదనపల్లెకు తీసుకొచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

తిరుపతిలో పోస్టుమార్టం పూర్తి

యమున మృతదేహాన్ని మంగళవారం తిరుపతికి తీసుకెళ్లారు. దానిపై వివాదం చెలరేగడంతో అదేరోజు రాత్రి మదనపల్లెకు తీసుకురాగా ఇక్కడ స్పెషలిస్టులు లేకపోవడంతో బుధవారం రాత్రి తిరిగి తిరుపతికి రుయాకు తరలించారు. అక్కడ పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎడమవైపున కిడ్నీ తొలగించినట్లు చెబుతున్నారు. ఇదిలావుండగా, గ్లోబల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ ఆంజనేయులు మాత్రం తాను ఆసుపత్రిని ఇతరులకు లీజుకు ఇచ్చానని, కిడ్నీ తొలగింపు విషయం తనకు తెలియదని పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. డాక్టర్ కూడా కిడ్నీలో రాళ్లు తొలగించే ప్రక్రియ చేపట్టేవారని, కిడ్నీ తొలగించి డోనర్ మృతికి కారణమైన విషయం తనకు తెలీదని చెప్పినట్లు తెలిసింది.

విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

మదనపల్లెలో జరిగిన కిడ్నీ రాకెట్ కేసు విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. గురువారం మదనపల్లెకు వచ్చిన మంత్రి కిడ్నీ ఆపరేషన్ వ్యవహారంలో దోషులు ఎవరున్నా, ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే ఏ-1 డాక్టర్ ఆంజనేయులుతో పాటు మరో ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు మంత్రి తెలిపారు. మదనపల్లె తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కూడా ఎక్కడైనా జరిగాయా? ఇలాంటి కార్యకలాపాలు కొనసాగే పరిస్థితులపై కూడా దృష్టి కేంద్రీకరించినట్లు మంత్రి వివరించారు.

చోరీలను నివారిస్తాం : డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గస్తీల్లో పోలీసులను ఏర్పాటు చేసి చోరీలను నివారిస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆయన మండల కేంద్రమైన సిద్దవటం పోలీసుస్టేషన్‌లో పలు విభాగాల రికార్డులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణకు రాత్రివేళల్లో పోలీసుల గస్తీలు, పల్లె నిద్ర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రౌడీషీటర్లు గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, బైక్ ఢీ ఘటనపై కేసు నమోదు

బి.కొత్తకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూరపువారిపల్లె వద్ద ఈనెల 11న ద్విచక్రవాహనంలో వెళుతున్న బత్తుల శంకరను టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో గట్టు పంచాయతీ పరిధిలోని శంకర్ తల, ఎడమకాలుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని బి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి తన భర్తను తీవ్రంగా గాయపరిచాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య మంజుల గురువారం ఫిర్యాదు చేసిందని ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు



మీడియాతో మాట్లాడుతున్న ఇడగొట్టు నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా క్వారీల్లో వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వడ్డెర ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన వడ్డెరుల, భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద వడ్డెర ప్రజాగళం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య, గుంటూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో క్వారీల్లో వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ సుమారు 200 మందితో రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లామని, వడ్డెరుల నిరసనకు స్పందించిన మైనింగ్స్ రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వారం పది రోజుల్లో క్వారీల్లో వడ్డెరుల సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన అవసరం

జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుణశేఖర్

రాయచోటిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, వృత్తి మార్గదర్శకతపై అవగాహన అవసరమని జిల్లా ఆరోగ్య విద్యాధికారి పి.గుణశేఖర్ తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శివశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నిజాయితీ, సానుకూల దృక్పథంతో ప్రారంభమవుతుందని చెప్పారు. అనంతరం స్టైఫ్ మేనేజర్ సుబ్బరాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో స్టైప్ సూపరింటెండెంట్ నారాయణ, కళాశాల ఈఈఈ విభాగాధిపతి ఇందిర ప్రియదర్శిని, ఈసీఈ విభాగాపధిపతి చెన్నకేశవప్రసాద్, జనరల్ సెక్షన్ ఇన్‌చార్జ్ నాగసురేంద్రారెడ్డి, ఐఎస్‌టీఈ కో-ఆర్డినేటర్ బుజ్జిబాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సహదేవ పాల్గొన్నారు.

విజయవంతంగా క్రీడా పోటీలు

- 19 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11, 13 తేదీల్లో రాయచోటిలోని డీఎస్ఏ క్రీడా మైదానం జిల్లా స్థాయిలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలు విజయవంతంగా నిర్వహించామని జిల్లా క్రీడా అధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, కబడ్డీ, లాన్ టెన్నిస్, క్యారమ్స్, హాకీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్ అండ్ పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, బెస్ట్ ఫిజిక్యూ, రెస్లింగ్ (కుస్తీ), డ్యాన్స్ మ్యూజిక్ అండ్ షార్ట్‌ల ప్లే విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా క్రీడా జట్లకు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఎంపికైన ఈ జట్లు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు విజయవాడ, గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

అధిక శబ్దాల సైలెన్సర్లు వాడితే కఠిన చర్యలు : డీఎస్పీ



కడప ఏడు రోడ్ల కూడలిలో సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం

కడప క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లను వాడే ద్విచక్రవాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం కడప ట్రాఫిక్ సీఐ కె.జావీదు, సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సుమారు 40 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం కడప ఏడు రోడ్ల కూడలిలో సైలెన్సర్లను ధ్వంసం చేశారు.

ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులకు ఎన్నిసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రావడంలేదని, ఇకపై అధిక శబ్దం కలిగే సైలెన్సర్లను వాడే వాహనం పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. నగరంలో శబ్ధ కాలుష్యాన్ని తగ్గించడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అధిక శబ్దాల వల్ల వృద్దులు, రోగులు, పాదచారులు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా గే కంపెనీ సైలెన్సర్లను మార్చి అధిక శబ్దాలు కలిగించే సైలెన్సర్లను అమర్చే మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

వరి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు : ఏడీఏ



వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి పంట పండించే రైతుల కోసం వరిధాన్యం సేకరణకు తగిన ఏర్పాట్లను చేశామని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇడుపులపాయ-2 రైతు సేవా కేంద్రాన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంగా కేటాయించడంతో ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని మూడు గ్రామాలలో 700 మంది రైతులు వెయ్యి ఎకరాలలో వరి పంటను సాగుచేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరిధాన్యం సేకరణకు తగిన ఏర్పాట్లను చేశామన్నారు. ఇందులో భాగంగా వరిధాన్యం గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకం క్వింటాల్ రూ.2369 గాను ప్రభుత్వం నిర్వహించడం జరిగిందన్నారు. తేమశాతం 17శాతానికి, చెత్త,రాళ్లు, తాలు ఒక శాతానికి మించరాదని చెడిపోయిన, రంగుమారిన విత్తనాలు ఐదు శాతానికి మించరాదని, పరిపక్వానికి రాని మరియు వంకర తిరిగిన గింజలు మూడు శాతానికి మించకూడదని ఆయన రైతులను ఉద్దేశించి తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రాల సిబ్బంది సురేఖ, మహేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ కేసులో ఇరువురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలోని మురారిచింతల, అంబకపల్లె గ్రామ పొలాల్లో కేబుల్ వైర్ల దొంగతనం కేసులో ఇరువురిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం డీఎస్పీ మురళీనాయక్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బుడగజంగం మోతీ జయమయ్య, బుడగజంగం మోతీనాగరాజు అనే ఇరువురిని కేబుల్ దొంగతనం కేసులో అరెస్టు చేశామన్నారు. తండ్రీ కొడుకులైన వీళ్లు స్టీల్, అల్యూమినియం పాత్రలను ఆటోలో వేసు కొని పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాల్లో తిరు గుతూ వ్యాపారం చేసేవారు. ఆ సమయంలో కొందరు పాత వైర్లను వేసి పాత్రలు కొనుగోలు చేశారు. వాటిని కాల్చి అందులో ఉన్న కాపర్ తీగలను విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఇందులో మంచి ఆదాయం రావడంతో రైతుల పొలాల వద్ద ఉన్న కేబుల్‌వైర్ చోరీ చేసి సొమ్ము చేసుకోవడం అలవాటుగా మార్చు కున్నారు. ఈనేపధ్యంలో వీరిపై ఎస్ఐ అనిల్‌కుమార్ నిఘా పెట్టి అంబకపల్లె గ్రామ సమీపంలో అరెస్టు చేశారని తెలిపారు. కాగా, రైతుల పొలాలవద్ద వ్యవసాయ పరికరాల చోరీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



మనోజ్‌కుమార్ మృతదేహం

బద్వేలుటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరు మామిళ్ల బైపాస్‌రోడ్డు భగత్‌సింగ్‌కాలనీలో బండెల మనోజ్ కుమార్ (25) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందాడు. ఎంతసేపటికి తలుపులు తీయక పోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు తెరవగా ఉరివేసుకొని వేలాడుతూ కనిపించారు. వెంటనే తల్లి కుమారికి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మనోజ్‌కుమార్ జీవనోపాధికోసం ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఏమైందో ఏమో తెలియ దుకానీ ఉరివేసుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

చక్రాయపేట ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



రెడ్డయ్య (ఫైల్)

చక్రాయపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దర్శి రెడ్డయ్య (45) గురువారం మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.... రెడ్డయ్య అనారోగ్యం బారిన పడడంతో తిరుపతికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఇతనికి భార్య ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఇతని మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళ అదృశ్యం



మైదుకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం శివపురం గ్రామానికి చెందిన భూమాయపల్లి ఓబుళమ్మ(57) అదృశ్యమైంది. ఈమె భర్త వెంకటసుబ్బయ్య మరణించడంతో కుమారుడు దుర్గాప్రసాద్ సంరక్షణలో ఉంటున్నారు. గత మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉమామహేశ్వరాలయంలో నవగ్రహాలు ధ్వంసం



పెకలించిన విగ్రహాలు

చెన్నూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ఉమా మహేశ్వరాలయంలో నూతనంగా ప్రతిష్ఠ చేసిన నవగ్రహాల్లో రెండు విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం మధ్యాహ్నం ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన రెండు విగ్రహాల్లో ఒకటి పక్కన ఉన్న తమలపాకు తోటలో, మరో విగ్రహాన్ని ప్రతిష్ఠ జరిగిన చోట పక్కన పడేశారు. ఈ విషయమై ప్రజల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

ఎయిడ్స్‌వ్యాధి గ్రస్తుల పట్ల చిన్న చూపు తగదు

● జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్

కడప కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌వ్యాధిగ్రస్తుల పట్ల చిన్న చూపు, వివక్షత తగదని.. సమాజంలో వారు కూడా అందరితో సమానంగా భావించాలని జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి బాబాపక్రుద్దీన్ అన్నారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులు, వారి పిల్లలతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సవిల్ జడ్జి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపేవారిపై చర్యలు తప్పవన్నారు. వారికి హెచ్ఐవీ నవరణ చట్టం 2017 యాక్ట్ అండగా ఉంటుందన్నారు. వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన జీవన ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. నల్సా పథకం అయిన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వారి పిల్లల సంరక్షణకు స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం-2024, న్యాయసేవ అధికార సంస్థ మానసికంగా అనారోగ్యంగా ఉన్న వ్యక్తులు, మేథో వైకల్యం ఉన్న వ్యక్తులకు చట్టపరమైన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, హెచ్ఐవీ వ్యాధిపై అందళన వద్దని, జీవన ప్రమాణాలు పెంచేందుకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవికుమార్, శిశు సంక్షేమశాఖ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాన్, ఎంఈవో రఫీక్ అహమ్మద్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పాజిటీవ్ నెట్ వర్క్ అధ్యక్షురాలు ఉష తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయకపోతే ధర్నా చేస్తాం

● ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి



సీఐకి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

సింహాద్రిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంకాళమ్మ గూడూరు సచివా లయంలో విధులు నిర్వహిస్తున్న హార్టికల్చర్ అసిస్టెంటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రైతుల వద్ద తీసుకున్న డబ్బులు వారం లోపు చెల్లించకుంటే కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బాధిత రైతులకు న్యాయం చేయాలంటూ ఆయన గురువారం రైతులతో కలసి సింహాద్రిపురం పోలీసు స్టేషన్ వద్ద పులివెందుల రూరల్ సీఐ రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. రైతులు సకా లంలో పంట సాగు చేసేందుకు విత్తన శనగలకు, ఎరువుల బస్తాలకు డబ్బులు చెల్లిస్తే.. దాదాపు రూ.20 లక్షలు తీసుకుని పారిపోయిన ఉద్యోగిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. సంబంధిత అధికారులైనా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించకపోవడానికి కారణం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయం తెలిసిన డీఎస్పీ మురళీ నాయక్ అక్కడకు చేరుకొని మాట్లాడారు. హార్టీకల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చేతుల్లో మోసపోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన ప్రవీణ్‌కుమార్ రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. అతన్ని త్వరలోనే అరెస్ట్ చేసి, చట్టప్రకారం రైతులకు న్యాయం చేస్తామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐ పాల్గొన్నారు.

19న విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బద్వేలు బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో వైవీయూ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళల) సింగిల్స్ డబుల్స్ విభా గాలలో పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ కె.రామ సుబ్బారెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు విశ్వవిద్యాలయం అను బంధ సంస్థలలో చదివి ఉండాలన్నారు. తమ వెంట ఒరిజినల్ స్టడీ సర్టిఫికె ట్‌తో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రా లపై అటెస్ట్ చేయించి తీసుకురావాలన్నారు. క్రీడాకారుల వయో పరిమితి 17 సంవత్సరాలపైబడి 25 సంవత్స రాలలోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9705459052 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హోటళ్లపై దాడులు 35 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో గురువారం హోటళ్లు, చికెన్ సెంటర్లపై దాడులు చేశారు. ఇంటిలో వినియోగించే గ్యాస్ సిలిండర్లు హోటళ్లలో, చికెన్ సెంటర్లలో వినియోగిస్తున్నారని సమాచారం రావడంతో జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందుమోరే తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో తనిఖీలు చేసి 35 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటల్స్‌లో కమర్షియల్ సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఇంటి అవసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దేశం బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలి

ఖాజీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరచి దేశాన్ని బలమైన ఆర్థికశక్తిగా చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తపేట, నాగసానిపల్లె పంచాయతీల్లో ప్రతి ఇంట స్వదేశీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు కొనుగోలు చేయాలని, విదేశీ వస్తువులపై మొగ్గుచూపవద్దని అన్నారు.

వైవీయూ రిజిస్ట్రార్‌ను తొలగించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రతి పనిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజారుస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మను తక్షణం తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో గతంలో, ఇప్పుడు అవకతవకలు జరుగుతూనే ఉన్నాయని, దీనిపై ఉపకులపతి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్త దందాపై విచారణ చేసి క్లీన్‌చిట్ ఇస్తే విచారణ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో వైద్య కేంద్రంలో కనీసం మాత్రలు కూడా అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

కళాశాల అభివృద్ధి మండలి (సీడీసీ)లో పాత ఇంటర్నల్ రికార్డ్స్ అమ్మకం కోసం సీడీసీ డీన్ 30.10.2025న జారీ చేసిన వైవీయూ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారని, ఈ కొటేషన్ లేఖలో 03.10.2025లోపు కొటేషన్లు చేరాలని పేర్కొనడం వైవీయూ అధికారులకే సాధ్యమన్నారు. కావాలని తేదీ తప్పుగా వేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. నిబంధనలకు గాలికి వదిలేసి 10.11.2025న పాత రికార్డ్స్ అక్రమంగా అమ్ముకున్నారని ఆరోపించారు.

లెప్రసీ పరీక్షలు తప్పక చేయించుకోండి

కలసపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది గుర్తించిన కొన్ని లక్షణాలు గల ప్రజలు తప్పకుండా లెప్రసీ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలు పేర్కొన్నారు. జాతీయ కుష్టునిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. శరీరంపై స్పర్శలేని రాగిరంగు పొడ మచ్చలు, నొప్పితో కూడిన లావునరాలు, కండరాల బలహీనత తదితర లక్షణాలు కలవారు లెప్రసీ పరీక్షలు తప్పక చేయించుకోవాలన్నారు.

భారీ స్కోర్లు సాధించిన నెల్లూరు, కడప జట్లు



కిన్నుకిషల్, సాయికృష్ణచైతన్య, రక్షణ్‌సాయి

కడప స్పోర్ట్స్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్స్ క్రికెట్ మ్యాచ్‌లలో గురువారం మొదటిరోజు ఆటముగిసే సమయానికి తమ ప్రత్యర్థి జట్లపై కడప జట్టుతో పాటు నెల్లూరు జట్టు భారీ స్కోర్లు సాధించాయి.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 70.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 351 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. ఇందులో కిన్నుకిషల్ 163, సూర్యప్రకాశ్ 65, కార్తీ 51 పరుగులు చేయడంతో భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 300 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.2 ఓవర్లలో 289 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాయి కృష్ణచైతన్య 107, శివచరణ్ 65 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ రక్షణ్‌సాయి 5 వికెట్లు సాధించారు. అనంతరం చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలోనే 3 ప్రధాన వికెట్లు కోల్పోయి కేవలం 11 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 278 పరుగులతో వెనుకబడింది.

బాలల భవిష్యత్‌ను చక్కదిద్దడానికే బాలోత్సవం



బాలోత్సవ బుక్‌లెట్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్తమాన సమాజంలో బాలల భవిష్యత్తును చక్కదిద్దడానికి... వారిలో సృజనాత్మక వికాసానికి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు రిటైర్డ్ ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ గుర్రాల గోపాల్ తెలిపారు. గురువారం స్థానిక హోమస్‌పేటలోని జేవీవీ కార్యాలయంలో ఈనెల 29, 30న కడప మరియాపురంలోని సెయింట్‌జోసఫ్ బాలికల పాఠశాలలలో నిర్వహిస్తున్న బాలోత్సవ బుక్ లెట్స్‌ను ప్రముఖులు ఆవిష్కరించారు.

ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాల విద్యార్థులకు నవంబరు 29న వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు, కథ రచనను సీనియర్స్, జూనియర్స్ విభా గాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం, రోడ్డు ప్రమాదాలు నివారణ, భారత రాజ్యాంగం- ప్రాథ మిక హక్కులు, జూనియర్స్ విభాగంలో మాదక ద్రవ్యాలు-చెడుప్ర భావాలు, నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా, డార్విన్ పరిణామ సిద్ధాంతాలు వ్యాసరచ నగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 30న కూడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు నవంబరు 23 లోపు గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.


ఈ పోటీల్లో గెలిచిన ప్రతి విద్యా ర్థికి ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో నాగము నిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ హెడ్మాస్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ENDOWMENTS DEPARTMENT
SRI VEERANJANEYA SWAMY DEVASTHANAM
Gandikshetram, Marellamadaka (V)
Chakrayapeta (M), YSR Kadapa District.

e-Procurement Tender
NIT. No. Q/COE/913/2025, Dt:13-11-2025

E-Tenders are invited through the e-Procurement portal for the Repainting for Anjanadhri VIP Cottages, Cottage and Office Building. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligiblity criteria and submission guidelines.

TRUST BOARD CHAIRMAN & MEMBERS — Sd/- ASSISTANT COMMISSIONER & EXECUTIVE OFFICER



CHANGE OF NAME
I, SYED RAFI (old name), residing at D. No: 8/209-1-15-2, Bismillah Nagar, KADAPA, Y.S.R. District, ANDHRA PRADESH., hearby changed my name as SYED MOHAMMED RAFI (new name), S/O SYED AHMAD SAB
AJC-000

WANTED
1) జిరాక్స్ ఆపరేటర్, 2) కంప్యూటర్ ఆపరేటర్ (తెలుగు, ఇంగ్లీష్ టైపింగ్ కలిగి మీ సేవ సెంటర్ నందు) పనిచేసిన అనుభవం కలగినవారికి ప్రాధాన్యత, కడప లోకల్ ఓన్లీ సెల్ : 62815 10785
Ajc-258630

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 257555

LOSS OF PASSPORT
I, KESHALUGARI VISHALI D/o. KESHALUGARI VENU GOPAL, Aged 37 years, Flat.No.G3 (1ST FLOOR), BALAJI RESIDENCY APARTMENT, PRAKASH NAGAR, KADAPA, YSR KADAPA Dist, A.P-516002. I am the holder of Indian Passport bearing no: M0074616. The said passport was lost by me, while I was going to Xerox Center, Near 7 Roads circle, Kadapa on 22-10-2025
AJC-000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

నేడు ఉచితంగా బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కార్డుల పంపిణీ

కడప రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు, గుమస్తాలకు, కక్షిదారులకు బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కార్డులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ఎ.ఉమాదేవి, లీగల్ అవేర్‌నెస్ ఫర్ ఉమెన్ అధ్యక్షుడు పి.ప్రమోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళలు సమాఖ్య ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలను సక్రమంగా వినియోగించుకుని స్థిరమైన జీవనోపాధిని పొందాలన్నారు. అదే విధంగా స్మార్ట్‌కిచెన్ నిర్వహణలో విజయవంతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ, ఏపీఎం, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లంబోదర

కడప మారుతీనగర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరి లంబోదర నియమితులయ్యారు. కొన్ని సంవత్సరాలుగా బీసీ వర్గాల అభ్యున్నతికి శ్రమిస్తున్న లంబోదర సేవలను గుర్తించి ఏకగ్రీవంగా నియమించినట్లు ఆ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు వెల్లడించారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని ఫ్రంట్ కార్యాలయంలో నియామక ఉత్తర్వులను అందజేశారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL CIVIL JUDGE, (SENIOR DIVISION) : KADAPA.

I.A. No. 252 / 2025

O.S. No. 49/2025

Suda Anki Reddy S/o S. Nagi Reddy, R/o D.No. 4/11, R/o Choutapalle Village, Machnur Post, Pendlimarri Mandalam, Kadapa district. **... Plaintiff**

Vs

Vallamkondu Varadha Raja S/o V. Anjaneyulu Shetty, R/o D.No. 1/418-5A, Maruthi Nagar, Kadapa City, YSR Kadapa District. **... Defendant**

The above named plaintiff filed a suit for specific performance and also for injunction in I.A. No. 252/2025 O.S. No. 49/2025 against you, the defendant and the same is posted to 21.11.2025 for your appearance. Hence you are directed to appear or with an advocate before the Hon'ble court on 21-11-2025 at 10.30 a.m. and place your objections, else you will be set exparte and suit will be decided exparte.

(By Order of the Court)

Sri R. RAMA SUBBA REDDY, B.A., B.L.
Advocate, Kadapa, Cell : 78936 50016

SRI VENKATESWARA COLLEGE OF EDUCATION (B.Ed)

Recognised by NCTE & Affiliated to Yogi Vemana University, Kadapa
Chemmumiapet, Near Rly Gate, Rayachoty Road, KADAPA-516003
Mob:8919226239, 08562259564, Email: sriv25@gmail.com

B.Ed Spot & Management Quota Admissions - EDCET CODE : SRIV

Applications are invited from eligible candidates for the academic year 2025-2026 under Management Quota and Spot Admissions seats (Category A&B leftover & not reported students seats). Application forms can collect from college office from 14-11-2025 to 15-11-2025. Last date for submission of applications is 15-11-2025. Selection will be made as per the APSCHE guidelines.

Eligibility : Candidate shall have obtained in aggregate of 50% of marks at Degree / PG Level Examination for OC and 40% of Marks in respect of BC and SC/ST. **- PRINCIPAL**

Vasavee Ads, kdp

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 22.11.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.42-107-7&8, 1వ అంతస్తు ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్,జయనగర్ కాలనీ,అప్సర సర్కిల్, కడప,కడప జిల్లా-516002

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
PRDTRPJ2505310002	YAROLLA RAVANAMMA	JMLMDPJ2502170002	PANDITI SUBBARAYUDU
VEMPAPJ2502280002	SHAIK AHAMMADIMTHIYAZ	PRDTRPJ2505170004	SREELATHA ONTIGARI
VEMPAPJ2502280011	CHITTIMIREDDY AYAVAREDDY	PLVDLPJ2505120005	VENKATARAMANA KOMANUTHALA
PLVDLPJ2502240001	BONALA HASEENA	PLVDLPJ2505240001	SHAIK PAGIDIPALLI FARUK V
VEMPAPJ2505220007	BALAKRISHNAREDDY CHINTHALAPALLI	JMLMDPJ2505050002	RAJESH TIPPAGANDLA
VEMPAPJ2502200003	VURUTURU GANGULAIAH	PRDTRPJ2505170007	NARAYANA GOPINATH

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ K.SURESH BABU ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.11.2025 సం/- అధీకృత అధికారి
స్థలం : కడప శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, తదితరులు

కడప కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సభ్యులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా సహ కార సంఘ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార బ్యాంకులు స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలన్నారు. రైతు సంఘాల ద్వారా అన్ని రకాల ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలో డీసీసీబీ అనుబంధంగా నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) ప్రాజెక్టు కంప్యూటరైజేషన్, ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల నిర్మాణం, కామన్ సర్వీసు సెంటర్ల నిర్వహణ, పెట్రోల్ ఔట్‌లెట్ నిర్వాహణ, ప్రధానమంత్రి భారతీయ జనౌషధీ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించి సూచనలిచ్చారు. అనంతరం అఖిల భారత సహకార వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను డీసీసీబీ అధికారులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీవో వెంకటసుబ్బయ్య, డీసీబీ సీఈవో రాజామణి, నాబార్డు ఏజీఎం విజయవిహారి, డీసీవో సుభాషిణి, డీపీవో రాజ్యలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై వైసీపీ అడ్డగోలు రాద్ధాంతం

● బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ బాలకృష్ణ యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణయాదవ్

కడప మారుతీనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలపై వైసీపీ అడ్డగోలు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా వుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ ఎం.బాలకృష్ణ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చామని బడాయి కబుర్లు చెప్పుకునే ఆ పార్టీ నేతలు ఎన్ని కళాశాలలు ప్రారంభయ్యాయో, ఇంకా ఎన్ని కాలేజీలు నిర్మాణదశలోనే నిలిచిపోయాయో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఏఏ కాలేజీలకు ఎంత ఖర్చు చేశారో ఆధారాలున్నాయని, ఒక్క పులివెందుల కళాశాలకు సైతం పూర్తి స్థాయిలో నిధులు చెల్లించలేకపోయారని ఆరోపించారు. అలాగే గిరిజన ప్రాంతమైన పార్వతీపురంలో మెడికల్ కాలేజీకి కేటాయించాల్సిన స్థలం కూడా కేటాయించకపోగా డబ్బా వాగుడు వాగడం వైసీపీ నేతలకే చెల్లిందన్నారు. నిలిచిపోయిన మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ఇటు విద్యార్థులకు వైద్య విద్యను, అటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం పీపీపీ (ప్రైవేటు-పబ్లిక్-పార్టనర్‌షిప్) ద్వారా పూర్తిచేసేందుకు సిద్ధపడిందన్నారు. ఈ విషయాన్ని మసి పూసి మారేడుకాయను చేసినట్లుగా మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారంటూ గొంతు చించుకుంటూ ప్రజలను తుప్పుదోవ పట్టించేందుకు కోటి సంతకాల నాటకానికి తెరతీయడం పద్ధతిగా లేదన్నారు. పీపీపీ విధానంలో జరిగే మేలు గురించి తమ పార్టీ నాయకుడు, మంత్రి సత్యకుమార్ చర్చకు సిద్ధంగా వున్నారని, ఇందుకు మీరు సిద్ధమేనా అని ప్రశ్నించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి, రంగప్రసాద్, బాలకృష్ణ, మహిళానాయకురాలు పద్మావతిభాయి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా

వీరపునాయునిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-2025 సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటల నమోదు జాబితాను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మండల వ్యాప్తంగా 2747 మంది రైతులు 12552 ఎకరాలలో పంటలు సాగుచేశారని తెలిపారు. పంట నమోదులో పొరపాట్లు ఉంటే ఈనెల 16వ తేదీలోపు సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలపాలని, అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను ప్రదర్శిస్తామన్నారు. వీటితో పాటు గ్రామసభలు కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వనజ, షమీముల్లా, రైతులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి రికార్డులు లేని వారికి జరిమానా విధించారు. అంతేకాకుండా విజిబుల్ పోలీసింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత నిబంధనలపై. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా, పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరిగేలా విజిబుల్ పోలీసింగ్ కొనసాగిస్తున్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉప్పు శ్రీనివాసులు

సీకేదిన్నె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా బుగ్గలేటిపల్లెకు చెందిన ఉప్పు శ్రీనివాసులును నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కరికి అందుబాటులో ఉండి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.



తొలగించిన సూపర్వైజర్లను విధుల్లోకి తీసుకోవాలి


అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీఐటీయూ నిరసన

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కడప జీజీహెచ్‌లో తొలగించిన సూపర్వైజర్లను తిరిగి విధులకు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మనోహర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ 18ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లను అకారణంగా తొలగించడం దారుణమన్నారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసుకునేవారికి డిగ్రీ అర్హత ఉంటుందని, కానీ పాతవారిని తీసేయాలని ఏ నోటిఫికేషన్‌లో ఉండదన్నారు. వీరు అధికారులను కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కడప నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి, జిల్లా అధ్యక్షుడు రాహుల్, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన చేతివృత్తిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని చేతివృత్తిదారుల సమాఖ్య కడప జిల్లా ప్రధాన కార్యదర్శి వీరశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం చేతివృత్తిదారుల సమాఖ్య కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఈడీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని అప్లికేషన్లు స్వీకరించి లబ్ధిదారులను కూడా ఎంపిక చేసి నేటికీ రుణాలు మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలో 30 రకాల చేతి వృత్తిదారులు ప్రధానంగా చేనేత, మత్స్యకార, రజక, నాయీబ్రాహ్మణ, వాయిద్యకారులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు, కల్లుగీత, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంచర, శిల్పులు తదితర చేతి వృత్తిదారులు ఈ సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు కేశవ, జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి, జిల్లా నాయకులు వెంకటరాములు, పొంగూరు నాగరాజు, బద్వేల్ ఏరియా కార్యదర్శి శివప్రసాద్, జె.కొండయ్య, నరసింహాచారి, ప్రసాద్‌ఆచారి, శివరాంఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర ఓబన్న విగ్రహ ఊరేగింపు

కడప మారుతీనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మొదటితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న విగ్రహాన్ని జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం (యువతరం) ఆధ్వర్యంలో గురువారం నగర శివారు ప్రాంత శ్రీరామ్‌నగర్ సర్కిల్ నుండి విగ్రహం ఏర్పాటు చేసే కడప-రాజంపేట బైపాస్ సర్కిల్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డేరంగుల శ్రీనివాసులు, బత్తల వెంకట్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా వడ్డెర ఓబన్న విగ్రహాన్ని కడపలో ఏర్పాటు చేయాలన్న తమ కోరిక త్వరలో సాకారం కానుందన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తల శ్రీను, నగర అధ్యక్షుడు ఆర్.సుబ్రమణ్యం, బత్తల జానకీరామ్, బత్తల లింగమూర్తి పలువురు వడ్డెరులు పాల్గొన్నారు.

నగరంలో వడ్డెర ఓబన్న విగ్రహ ఊరేగింపు



వ్యాయామ ఉపాధ్యాయుల రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న మహబూబ్ బాషా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మహబూబ్ బాషా గురువారం కడపనగరం జైనగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుల రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి విద్యార్థుల క్రీడా కార్యకలాపాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఈ పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వారిలో నలుగురు రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించారని ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, వ్యాయామ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

పారామెడికల్ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

● అఖిల భారత విద్యార్థి సమాఖ్య

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఎంఎస్‌టీ, అనస్థీషియా, డీవోఏ, డీఆర్‌జీఏ ఈసీజీ లాంటి అనేక పారామెడికల్ కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య కడప జిల్లా సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమునకు గురువారం వినతిపత్రం సమర్పించారు. హాస్టల్ వసతి లేకపోవడంతో వృత్తి విద్యా కోర్సులకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా జిల్లా సహాయ కార్యదర్శులు బి.అరుణ్, చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

18న సీపీఐ ఆందోళన

కమలాపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఈనెల 18న దేశ వ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని సీపీఐ మండల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాల మోదీ పాలనలో దేశవ్యాప్తంగా గిరిజనులు, మైనార్టీల మీద దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, కమలాపురం సహాయ కార్యదర్శి వరప్రసాద్, కార్యవర్గసభ్యులు గంగయ్య, సుబ్బయ్య, గంగులయ్య పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

వేముల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు సూచించారు. గురువారం వేములలో వేముల గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశం రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రాసంఘాల సమావేశాలను సభ్యుల ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు తీసుకోవడం జరుగుతుందన్నారు. గైర్హాజరైన వారికి జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ జ్యోతి, గ్రామ సమాఖ్య అసిస్టెంట్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత.. మన సంస్కృతిలో భాగమే


మాట్లాడుతున్న డీఎల్‌డీవో సరళ

కమలాపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమేనని డీఎల్‌డీవో సరళ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత అనేది మన ఇంటి నుంచే మొదలవ్వాలని, మన ఇంటిలో అయితే వస్తువులన్నింటినీ ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా మన బయట ప్రాంతాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ శిక్షణ కార్యక్రమానికి కొంతమంది సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు డుమ్మా కొట్టారు.

గ్రామాల పరిశుభ్రతే ప్రధాన ఉద్దేశం

పెండ్లిమర్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే థీమ్‌5 ప్రధాన ఉద్దేశ్యమని డీపీఆర్‌సీ ట్రైనింగ్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో గురువారం సర్పంచులు, కార్యదర్శులకు ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా పరిశుభ్రమైన, హరిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

వల్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాల్లో మురుగు పారకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రఘురామ్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీవోఏలకు గ్రామాల్లో క్లీన్‌అండ్ గ్రీన్‌పై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో మొక్కలు నాటేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీదర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ సరళ, తదితరులు పాల్గొన్నారు.

హరిత గ్రామాలుగా మార్చాలి

చెన్నూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో పరిశుభ్రమైన వాతావరణం తీసుకురావడమే కాకుండా హరితగ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు పరిశుభ్రత-పచ్చదనంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ ఆదర్శ గ్రామ పంచాయతీగా మారాలంటే మొట్టమొదట పరిశుభ్రంగా ఉండాలన్నారు. వీధుల్లో, ఇళ్ల ముంగిట, బహిరంగ ప్రదేశాల్లో చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాడి పడేసిన వస్తువులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, డిప్యూటీ ఎంపీడీవో గురువేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

చక్రాయపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో శివారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సర్పంచులకు, ఉపసర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు శిక్షణకార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో స్వచ్ఛతను పాటించాలని, పారివుధ్యంపై దృష్టిపెట్టాలని, ప్రతి గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత-పచ్చదనానికే మొదటి ప్రాధాన్యత

పులివెందుల రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత-పచ్చదనానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో కృష్ణమూర్తి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు వారానికి ఒకరోజు గ్రామాన్ని పూర్తిగా పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏవో రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కళ్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి


ఖైదీలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడప క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కళ్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డాక్టర్ మాధవీలత, జిల్లా ప్రోగ్రాం మేనేజరు డాక్టర్ భారతి సూచించారు. కడప కేంద్ర కారాగారంలో గురువారం జిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఖైదీలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసు రీత్యా కంటి సమస్యలుంటాయని, ఏదైనా చిన్న సమస్య జరిగినా డాక్టరును సంప్రదించాలన్నారు. వైద్యులు ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడితే ఫలితం ఉంటుందన్నారు. 168 మంది ఖైదీలకు పరీక్షలు నిర్వహించి మందులతో పాటు కంటి అద్దాలను అందించారు. అలాగే కళ్లకు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, డాక్టర్ శ్రీదేవి, జైలు పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో ఐశ్వర్యకు బంగారు పతకం

వీరపునాయునిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీరింగ్‌లో నర్రెడ్డి ఐశ్వర్యకు బంగారు పతకం సాధించింది. ఈ మేరకు గురువారం కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన కాన్వొకేషన్‌లో వీసీ బసవరాజు చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. మండలంలోని గోనుమాకులపల్లెకు చెందిన నర్రెడ్డి ఐశ్వర్య గ్రామంలోనే ప్రాథమిక విద్య, వేంపల్లెలో పదవ తరగతి వరకు, తిరుపతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ డిప్లమో, కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ చదివారు. ఐశ్వర్య గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



గోల్డ్ మెడల్ అందుకుంటున్న ఐశ్వర్య

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం

యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కడప - C.O.: 99854 04960 పులివెందుల - S.R.: 95812 61647 D.C.M.: 99854 11184

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● గ్రామాల్లో పరిశుభ్రత పెంపొందించాలి ● సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో డీఎల్‌పీవో


జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సర్పంచులు, అధికారులు

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యమని అందు కోసం గ్రామాలను శుభ్రంగా ఉంచాలని జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ సూచించారు. గురువారం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ప్రభుత్వ, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మూడు రోజులపాటు క్లీన్ అండ్ గ్రీన్‌పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటిరోజు జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు హాజరైనా సర్పంచులు ముగ్గురు మాత్రమే హాజరుకాగా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల న్నారు. కొందరు సర్పంచులు శిక్షణ కార్యక్రమానికి హాజరుకాకపోవడంపై ఎంపీడీవో సైదున్నీసా మాట్లాడుతూ తాము అందరికి తెలియజేశామన్నారు.

చాపాడులో: మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వీరకిశోర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని ప్రతిరోజు తొలగించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరి సర్పంచులు ప్రసాదు, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, ఎంపీటీసీలున్నారు.

కాశినాయనలో: గ్రామ సచివాలయ ఉద్యోగులు పంచాయతీల్లోని ప్రజా ప్రతినిధులు సమష్టి కృషితో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో మైథిలీరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ముజఫర్ రహీం పేర్కొన్నారు. గురువారం నర్సాపురం మండల పరిషత్ సభాభవనంలో పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోతడి పొడి చెత్తను వేరుచేసి హరిత రాయబారులకు అందజేయాలన్నారు. సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండాపురంలో: గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో నాగప్రసాద్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, ఆఫీసులు, రోడ్లకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలసపాడులో: పచ్చదనం, పరిశుభ్రతపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహబూబ్‌బీ మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై పత్యేక దృష్టిపెట్టాలన్నారు. సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: సర్పంచుల సహకారంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ఈటీసీ మెంబరు సరళ, ఎంపీడీవో వెంకటరమణయ్యలు పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల మండలంలోని సర్పంచులకు, ఉపసర్పంచులకు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. టీటీటీ భాను ప్రశాంత్, సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో : పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలని ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ సభాభవనంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ అనే అంశంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి హాజరయ్యారు.

ఖాజీపేటలో: పంచాయతీలు అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని ఏవో వెంకటరమణ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో క్లీన్ అండ్‌గ్రీన్‌పై సర్పంచులకు, ఉపసర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. అపరిశుభ్రత వలన అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

సదరం స్లాట్‌బుకింగ్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 14 నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. సదరం సర్టిఫికెట్లు తీసుకోనివారు వారి వారి పరిధిలోని సచివాలయాల్లో కానీ, మీసేవా కేంద్రాల్లోకానీ స్లాట్ బుక్ చేసుకోవాలని, తర్వాత వారు ఇచ్చిన తేదీల్లో క్యాంపులో పాల్గొని సదరం సర్టిఫికెట్ అందుకోవాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిల ప్రమాణస్వీకారోత్సవంలో భూపేశ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన ధ్యేయమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జిలు, మండల నాయకులు అందరు కలిసికట్టుగా పనిచేయాలన్నారు.. అనంతరం ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. పెద్దముడియం మండలం టీడీపీ మండల కన్వీనర్‌గా రెండవసారి చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి ఎంపికయ్యారు. అలాగే కొండాపురం మండలానికి సంబంధించి టీడీపీ అధ్యక్షుడుగా మరోసారి నాగేశ్వరరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ మల్లికార్జున, వీపీ ఓబుళరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు, నాయకులతో భూపేశ్‌రెడ్డి ఆయా మండలాల్లోని సమస్యలపై చర్చించారు. కొందరు జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబంధించి అలాగే జమ్మలమడుగు మండలంలోని వారి వారి సమస్యలను తెలియజేశారు.

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం : రితేష్


రితేష్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న మండల అధ్యక్షులు

బద్వేలుటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 7మండలాలతోపాటు మున్సిపాలిటీ విభాగానికి కూడా పార్టీ అధ్యక్షులను, క్లస్టర్ విభాగ అధ్యక్షులను, బూత్‌కమిటీ కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి హాజరై 7మండలాల అధ్యక్షులు, బూత్‌కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, మాజీ మంత్రివర్యులు బిజి వేముల వీరారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్వరలో వచ్చే సంస్థాగత ఎన్నికల్లో పార్టీసత్తాచాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలాల వారిగా ఎంపికైన మండల అధ్యక్షులు, అభ్యర్థుల వివరాలను ప్రకటించి వారితో ప్రమాణస్వీకారం చేశారు. బద్వేలు మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడిగా గుర్రం పాటి వెంగల్‌రెడ్డి, బద్వేలు మండల అధ్యక్షుడిగా బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, అట్లూరు మండల అధ్యక్షుడిగా పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి, గోపవరం మండల అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, బి.కోడూరు మండల అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడుగా భైరవప్ర సాద్, కాశినాయన మండల అధ్యక్షుడిగా మురుకూటి రాజారెడ్డి, కలసపాడు మండల అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రాగిమాను ప్రతాప్‌కుమార్, శివయ్యస్వామి, మస్తాన్‌బాబు, సాదనకారి రంతు, జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, పీఆర్‌పీ బాషా, నిమ్మకాయల గోపాల్‌రెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు


ఉప్పరపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పరపల్లె, కామనూరు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాల ప్రకారం తమ పంటను కనీస మద్ధతుధర కన్నా తక్కువగా అమ్ముకోవాల్సిన అవసరంలేదని, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో నష్టపోకూడదని వివరించారు. రైతు సేవాకేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. ఈ పంట నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుటకు సిద్ధమైన వారి వద్ద నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. వ్యవసాయ సహాయకుల ద్వారా ధాన్యం సేకరించి తేదీ, సమయంతో కూడిన కూపన్లను జారీ చేస్తారని ధాన్యం విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వరి కొనుగోలుకు రెండు కేంద్రాలు ఏర్పాటు

చాపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చాపాడు మండలంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చాపాడు, అన్నవరం గ్రామాల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏవో దేవీ పద్మలత చెప్పారు. మండలంలోని రైతులు ఎక్కువగా కేఎన్ఎం, బీపీటీ 5204, ఎన్‌డీఎల్ఆర్ రకాలు సాగు చేసినట్లు చెప్పారు. మొత్తం 18,500 ఎకరాల్లో వరి పైరు సాగు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి రైతులు వరి కోతలు మొదలు పెట్టే అవకాశం ఉందన్నారు. వరి ధాన్యంలోని తేమను గుర్తించేందుకు మీటర్లను సిద్ధంగా ఉంచామన్నారు. వరి ధాన్యం సాదారణ రకానికి క్వింటాలుకు ఎ-గ్రేడ్ రకానికి రూ.2,389 మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. దరి ధాన్యంలో 17 శాతం తేమ ఉంటే కొనుగోలుకు అవకాశం ఉంటుందన్నారు. తేమను గుర్తించే మీటర్లను మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి పరిశీలించారు.

ఖాజీపేటలో: పుల్లూరు పంచాయతీలోని రైతు సేవా కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని వ్యవసాయాధికారి నాగార్జున అన్నారు. గురువారం డీపీఎం ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం వంద కేజీలు రూ.2,389లతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎక్కువ తేమ శాతం లేకుండా రంగు మారినా తీసుకురావచ్చన్నారు. మట్టి, రాళ్లు, వ్యర్థాలు లేకుండా తీసుకొస్తే కొనుగోలు చేయడంతోపాటు రవాణా ఖర్చులు కూడా రైతుల ఖాతాల్లో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఉద్యోగులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడు జె.రామసుబ్బయ్య, కార్యదర్శి ఇ.ఇప్రమీళ పేర్కొన్నారు. గురువారం ఎన్జీవో హోంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎం.బాలపుల్లయ్య, సహాయ ఎన్నికల అధికారిగా పద్మనాభరావు, పరిశీలకులుగా నిత్యపూజయ్యలు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బాలపుల్లయ్య మాట్లాడుతూ అసోసియేషన్ 18 పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే వేశారని, అందువలన సభ్యులందరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడుగా రామసుబ్బయ్య, సహ అధ్యక్షుడు జె.అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా నాగరాజు వరప్రసాద్, నాగార్జున, అన్వర్‌హుస్సేన్, సంధ్యారాణి, కార్యదర్శిగా ప్రమీళ, ఆర్గనైజింగ్ సెక్రటరిగా ప్రభంజన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా మధుసూదన్‌రెడ్డి, నారాయణరాజు, సుబ్బరాయుడు, రెడ్డయ్య, సుజాత, కోశాధికారిగా సదాశివయ్య, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
నేటి బాలలే రేపటి పౌరులు. బాలల దినోత్సవ సందర్భంగా బాలబాలికలందరూ భావిభారత పౌరులుగా ఎదిగి, జాతికి గర్వంగా నిలవాలని కోరుకుంటూ...
బాలాజి హైస్కూల్
జమ్మలమడుగు

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
నేటి బాలలే రేపటి పౌరులు. బాలల దినోత్సవ సందర్భంగా బాలబాలికలందరూ భావిభారత పౌరులుగా ఎదిగి, జాతికి గర్వంగా నిలవాలని కోరుకుంటూ...
శ్రీ సంగమేశ్వర హైస్కూల్
కొర్రపాడు రోడ్డు, ప్రొద్దుటూరు

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
నేటి బాలలే రేపటి పౌరులు. బాలల దినోత్సవ సందర్భంగా బాలబాలికలందరూ భావిభారత పౌరులుగా ఎదిగి, జాతికి గర్వంగా నిలవాలని కోరుకుంటూ...
గీతాంజలి హైస్కూల్
బుడ్డాయపల్లె, ప్రొద్దుటూరు
శ్రీ సరోజినీ హైస్కూల్
మున్సిపల్ పార్క్ దగ్గర, వసంతపేట, ప్రొద్దుటూరు.
YMR కాలని, ప్రొద్దుటూరు

SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న ఋణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన ఋణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం వేయు తేది: 22.11.2025 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,డోర్ నం.42-107-7&8, 1వ అంతస్తు ఓబుల్ రెడ్డి కాంప్లెక్స్,జయనగర్ కాలనీ,అప్సర సర్కిల్, కడప,కడప జిల్లా-516002

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
PRDTRPJ2505310002	YAROLLA RAVANAMMA	JMLMDPJ2502170002	PANDITI SUBBARAYUDU
VEMPAPJ2502280002	SHAIK AHAMMADIMTHIYAZ	PRDTRPJ2505170004	SREELATHA ONTIGARI
VEMPAPJ2502280011	CHITTIMIREDDY AYAVAREDDY	PLVDLPJ2505120005	VENKATARAMANA KOMANUTHALA
PLVDLPJ2502240001	BONALA HASEENA		
VEMPAPJ2505220007	BALAKRISHNAREDDY CHINTHALAPALLI	PLVDLPJ2505240001	SHAIK PAGIDIPALLI FARUK V
		JMLMDPJ2505050002	RAJESH TIPPAGANDLA
VEMPAPJ2502200003	VURUTURU GANGULAIAH	PRDTRPJ2505170007	NARAYANA GOPINATH

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆస్తిగల కొనుగోలుదారుడు శ్రీ K.SURESH BABU ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.
తేది: 13.11.2025 సం/- అధీకృత అధికారి
స్థలం : కడప శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

'కాశినాయన' ఎంపీడీవోకు పదోన్నతి

కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కాశినాయన మండల ప్రజా పరిషత్ ఎంపీడీవోగా పనిచేస్తున్న డాక్టర్ బి.మైథిలికి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు డీడీవోగా పదోన్నతి కల్పిస్తూ మైదుకూరు డ్వామా ఏపీడీగా నియమిస్తున్నట్లు ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. డాక్టర్ మైథిలిపై 2015లో చక్రాయపేట ఎంపీడీవోగా పనిచేసే కాలంలో కొన్ని అభియోగాలు నమోదయ్యాయి. ఈ ఆరోపణలపై విచారణల అనంతరం గత ఆగస్టు 1న కేసులను ఉపసంహరిస్తున్నట్లు పంచాయతీ రాజ్ కమిషనరు ఆదేశాలు జారీ చేశారు. తనపై మోపిన అభియోగాల నుంచి విముక్తి కలిగిన దరిమిలా తనకు పదోన్నతి అవకాశం కలిగించాలని ఎంపీడీవో మైథిలి ప్రభుత్వానికి విన్నవించుకుంది. అన్నింటినీ పరిశీలించిన అనంతరం తాజాగా ఆమెకు పదోన్నతి కల్పిస్తూ మైదుకూరు డ్వామా ఏపీడీగా నియమిస్తున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

డీసీసీ బ్యాంకు సేవలు వినియోగించుకోండి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలు, ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు, రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజరు సిరాజున్నీసా తెలిపారు. గురువారం బ్రహ్మంగారిమఠం మండల మహిళా సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా మేనేజరు సిరాజున్నీసా హాజరై మాట్లాడుతూ బంగారుపై తక్కువ వ్యవధిలోనే రైతన్నలకు పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు మేనేజరు అనిల్, ఏపీయం చిన్న ఓబులేసు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా భైరవ ప్రసాద్


భైరవ ప్రసాద్‌ను అభినందిస్తున్న రితీష్‌రెడ్డి

పోరుమామిళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల టీడీపీ మండల అధ్యక్షునిగా టేకూరుపేటకు చెందిన మాజీ సర్పంచ్ నగరి భైరవ ప్రసాద్ ఎన్నికయ్యారు. గురువారం బద్వేలులో ఎన్నిక కార్యక్రమం బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా మండల టీడీపీ అధ్యక్షునిగా భైరవ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు వారికి రుణపడి ఉంటానని టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని భైరవ ప్రసాద్ పేర్కొన్నారు.

గౌరమ్మకు విశేష పూజలు

బద్వేలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వనిత క్లబ్ ఆధ్వర్యంల కార్తీక మాసం పురస్కరించుకుని గౌరమ్మకు పలువురు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గౌరమ్మ ప్రతిమకు వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి, వనితా క్లబ్ అధ్యక్షురాలుచింతకుంట ధనలక్ష్మి, సెక్రటరీ వసుంధర, వాసవి వనితా క్లబ్ చార్టెడ్ అధ్యక్షురాలు హేమలత, మాజీ అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు పరిమితులను అతిక్రమించొద్దు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు పరిమితులకులోబడి చికిత్సలు చేయాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ హెచ్చరించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగంలో డివిజనల్ పరిధిలోని ఆర్‌ఎంపీలకు వారి విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు డాక్టర్ అనికానీ, క్లినిక్, ఆస్పత్రి అనికానీ రాసుకోకూడదని కేవలం ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు పెట్టాలని సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత మాట్లాడుతూ గర్భవతులకు, చిన్నపిల్లలకు చికిత్సలు చేయరాదని, ఆపరేషన్లు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. స్టెరాయిడ్లు, మత్తు మందులు, యాంటీబయాటిక్స్ సూచించరాదన్నారు. కార్యక్రమంలో డీఈఎంవో భారతి, పీపీ యూనిట్ అధికారి నజీర్, టుటౌన్ సీఐ సదాశివయ్య పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి పోలీసు ఔట్‌పోస్టు తనిఖీ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న పోలీసు ఔట్‌పోస్టును టుటౌన్ సీఐ సదాశివయ్య తనిఖీ చేశారు. సాదారణ తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన ఔట్‌పోస్టులోని రికార్డులను పరిశీలించి ప్రమాద బాధితులు నేరుగా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చినప్పుడు వారి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు మరణాలు, మృతదేహాలు, ఫొటోలను తీసి వాటిని నమోదు చేయాలని వివరించారు.

నడివూరు పెద్దమ్మతల్లి రాయి తొలగింపు

ఎర్రగుంట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నడిఊరు రామాలయం పక్కనే ఉన్న పెద్దమ్మ తల్లిని పూజించేస్థలంలో ఉన్న మూడు రాళ్లలో ఒక రాయిని గుర్తుతెలియని వారు గురువారం తెల్లవారుజామున పగలగొట్టారు. ఉదయం 5గంటల ప్రాంతంలో నిత్యం పూజలు నిర్వహించే వారు పూజలు నిర్వహించేందుకు వచ్చి ఇక్కడ ఉన్న మూడు రాళ్లలో ఒక రాయి లేకపోవడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థుల భక్తి మనోభావాలతో ఆడుకుంటున్న ఇలాంటి వారిని గుర్తించి శిక్షించాలని కోరుతున్నారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులు కొందరు సమాయత్తం అవుతున్నారు. ఇక్కడ రామాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం ఒక లోటుగా ప్రజలు పేర్కొంటున్నారు.

హైవే పై వాహనాలను అడ్డంగా ఉంచరాదు

కొండాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే పై వాహనాలను అడ్డంగా ఉంచరాదని కొండాపురం ఎస్సై ప్రతాప్ రెడ్డి తెలిపారు. హైవే పై భారీ వాహనాలను అడ్డంగా ఉంచడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన కొండాపురం పట్టణంలో హైవేపై గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించి హైవేపై రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్ల నాగేంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన వెంటనే చేపట్టాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుల గణన వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం సీపీఐ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనగణను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఈనెల 29, 30 తేదీల్లో పట్టణంలో పార్టీ వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా ఇన్‌చార్జి హరినాథ్‌రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు.

వనిపెంటలో పోలీసుల పల్లెనిద్ర

మైదుకూరు నవంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిదిలోని వనిపెంట గ్రామంలో సీఐ రమణారెడ్డి తన సిబ్బందితో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు..చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కారం పొందాలన్నారు.ప్రజలు శాంతియుతంగా జీవించాలని కోరారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటన దారుణం

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటన హేయమైన చర్య అని, ఇది దేశ ఐకమత్యాన్ని దెబ్బతీయడానికి చేసిన కుట్ర అని బీజేపీ పట్టణాధ్యక్షుడు పాశెం కిరణ్‌కుమార్ ఖండించారు. గురువారం బీజేపీ పట్టణ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనలో నిరపరాధులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.జయలక్ష్మి, డి.వేమననారాయణ, గురురాజేష్, షేక్ చౌషేన్, శ్రీకాంత్, గురు, తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియా పట్ల జాగ్రత్త వహించండి

బద్వేలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియా పట్ల జాగ్రత్తగా ఉండాలని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బోయినపల్లె గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల జబ్బులకు మందులు అందిస్తున్నామని, కార్యక్రమంలో సీహెచ్‌ఓ శిరీష, హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్ధనరావు, సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఏఎన్ఎం లక్ష్మినారాయణమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం
ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్
ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం
యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.
ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411193